నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I | హైదరాబాద్, ఆదివారం 29 డిసెంబర్ 2024 | RANGAREDDY


# బిల్లులు చెల్లిస్తారా ?..లేదా..?

### బల్దియా కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్ల నిరసన

సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్లు ఆందోళన చేపట్టారు. రూ. 1400కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా కమిషనర్ ఇలంబర్తి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదంటూ కమిషనర్ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అప్పుల ఊబిలో కూరుకుపోయామని, తీవ్ర ఆర్థిక ఒత్తిడితో నలుగురు కాంట్రాక్టర్లు చనిపోయారని కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ స్పందించి బిల్లులు విడుదల చేయాలని, లేదంటే జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 3వేల మంది కాంట్రాక్టర్లు చేస్తున్న పనులను నిలిపివేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.




వీకెండ్ కావడంతో శనివారం మాదాపూర్‌లోని శిల్పారామానికి నగరవాసులు కుటుంబసమేతంగా తరలివచ్చారు. కలియతిరుగుతూ..బోటు షికారు చేస్తూ..సందడి చేశారు.



# కొత్త మెనూ.. పాత చార్జీలు

### అమలుకు నోచుకోని డైట్ చార్జీల పెంపు

- రోజుకు ఒక్కో విద్యార్థికి పాత మెనూ ప్రకారం రూ.44 ఖర్చు.. పెంచింది రూ.88లకు..
- పాత బిల్లులు చెల్లిస్తూ కొత్త మెనూ డైట్ అమలు చేయాలన్న రాష్ట్ర సర్కార్
- సాధ్యం కాదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన వార్డెన్లు

*అమలుకు నోచుకోని హామీలిస్తూ అన్ని వర్గాలను కాంగ్రెస్ సర్కార్ అయోమయానికి గురిచేస్తున్నది. కాంగ్రెస్ సర్కార్ వచ్చిన ఏడాదిలోనే గురుకుల పాఠశాలల పరిస్థితి అధ్వానంగా తయారైంది. కనీస మౌలిక వసతులను కల్పించడంలోనూ సర్కార్ విఫలమైంది. గతేడాది కాలంగా ప్రభుత్వ గురుకులాల నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడంతోపాటు పర్యవేక్షణ లోపించింది. దీంతో ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ అంతటా వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగడం, రేవంత్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో రాత్రికిరాత్రే పెండింగ్‌లో ఉన్న డైట్ చార్జీలను విడుదల చేయడంతోపాటు డైట్ చార్జీలను పెంచుతున్నామంటూ హంగుఆర్భాటాలు చేస్తూ ప్రచారం చేసుకున్నది. తీరా పెంచిన చార్జీలను చెల్లించకుండా పాత మెనూ డైట్ బిల్లుల ప్రకారం కొత్త మెనూ డైట్ అమలు చేయాలని చెబుతుండడం గమనార్హం.*

*- వికారాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ)*

#### నాడు కళకళ.. నేడు వెలవెల..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గురుకుల పాఠశాలలు సకల సౌకర్యాలతో కళకళలాడాయి. 200 గురుకులాలను వెయ్యి పాఠశాలలకు పెంచింది. సన్నబియ్యం, రుచికరమైన వంటకాలతో పౌష్టికాహారాన్ని అందించింది. కార్పొరేట్ స్థాయిలో విద్యనందించడంతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన అనంతరం విద్యార్థులకు పురుగుల అన్నం దిక్కయ్యింది. తాగునీటి వసతి లేకపోవడం, అస్తవ్యస్తంగా మారిన బాత్‌రూంలతో విద్యార్థులు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొన్నది. ఏడాది కాలంగా నిధులను విడుదల చేయకుండా గురుకులాలను పూర్తిగా నిర్వీర్యం చేసేలా రేవంత్ సర్కార్ వ్యవహరిస్తున్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

#### ఆర్భాటానికే హాస్టళ్లలో కొత్త మెనూ..

ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన కొత్త మెనూ కేవలం ఆర్భాటానికేనని స్పష్టమవుతున్నది. డైట్ చార్జీలు పెంచుతున్నామంటూ సీఎం రేవంత్ రెడ్డి చిలుకూరు గురుకుల పాఠశాలలో కొత్త మెనూను ప్రారంభించి నెల రోజులు గడిచినా అమలుకు మాత్రం నోచుకోలేదు. చార్జీలు పెంచాం.. కొత్త మెనూ అమలు చేస్తామని ప్రచారానికి రూ.కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం.. ఇంకా పాత మెనూ ప్రకారమే డైట్ చార్జీలను చెల్లిస్తుండడం విడ్డూరంగా ఉన్నది. పాత మెనూ ప్రకారం ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.44లు ఖర్చు చేస్తుండగా, కొత్త మెనూ ప్రకారం రూ.88లను ఖర్చు చేయాల్సి ఉన్నది. కొత్త మెనూను అమల్లోకి తీసుకొచ్చిన ప్రభుత్వం.. డైట్ చార్జీలను పెంచకుండానే చేతులు దులుపుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే కొత్త మెనూను అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఒత్తిడి పెరుగుతుండడంతో హాస్టల్ వార్డెన్లు తలలు పట్టుకుంటున్నారు. పాత బిల్లులతో కొత్త మెనూ డైట్ సాధ్యం కాదని హాస్టల్ వార్డెన్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ చెప్పినట్లు తెలిసింది.

# మూసీ ఆక్రమణలపై చర్యలుంటాయి

- వార్షిక సమావేశంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

సిటీబ్యూరో:మూసీ రివర్‌ఫ్రంట్ బోర్డుతో తమకు సంబంధం లేదని, అయినప్పటికీ మూసీ ఆక్రమణలపై చర్యలుంటాయని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. నాలా వెడల్పునకు సంబంధించిన సమాచారం తీసుకుంటున్నామని , మూసీలో ఎక్కడెక్కడ ఆక్రమణలు జరిగాయో.. తమకు తెలిసిన చోట కూడా బిల్డర్స్‌కు చెప్పామని వారు తొలగించారని చెప్పారు. రాబోయే సంవత్సరంలో మూసీ ఆక్రమణలపై బిల్డర్స్‌ను ప్రాసిక్యూట్ చేస్తామని రంగనాథ్ అన్నారు. హైడ్రా ఏర్పడిన తర్వాత తమ పనితీరు, రాబోయే సంవత్సరంలో ఎలాంటి కార్యాచరణతో ముందుకెళ్తామన్న విషయాలపై శనివారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో ఏవీ రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. జూలై 19న హైడ్రా ఏర్పాటైందని, ఓఆర్ఆర్ లోపల 2వేల చదరపు కిలోమీటర్ల మేర హైడ్రా పరిధిలోకి వస్తుందని, తెలంగాణలో 35 శాతం జనాభా తమ పరిధిలో ఉంటారని రంగనాథ్ తెలిపారు. హైడ్రా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించామని, 12 చెరువులు, 8 పార్కులను అన్యాక్రాంతం కాకుండా కాపాడామని రంగనాథ్ తెలిపారు. ఆరు నెలల్లో హైదరాబాద్‌లో వర్షాలు పడి నీట మునిగితే హైడ్రా ఏం చేయలేదనే భ్రమలో ఉండొద్దని, హైడ్రా తీసుకొచ్చిందే ఆస్తులను కాపాడటం కోసమేనన్నారు. క్లౌడ్ బరస్ట్‌లు పెరిగాయని, ఐదు పదేండ్లు నిర్విరామంగా చేస్తే తప్ప ఏం చేయలేమన్నారు. హైడ్రా ఏర్పాటుతో ప్రజల్లో బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లపై అవగాహన పెరిగిందని, తాము ఏదైనా కొనాలనుకుంటే పూర్తిగా చెక్ చేసుకున్న తర్వాతే కొనుగోలు చేస్తున్నారన్నారు. హైడ్రా అంటే కూల్చివేతలే కాదని, పునరుజ్జీవనం కూడా హైడ్రా లక్ష్యమని, పన్నెండు చెరువుల పునరుద్ధరణకు సంబంధించి హైడ్రా డీపీఆర్ తయారు చేసిందన్నారు. బడ్జెట్ ఇస్తే తామే చెరువులను అభివృద్ధి చేస్తామని, లేకుంటే ఏజెన్సీలకు ఇస్తే సహకరిస్తామని తెలిపారు. చెరువులకు సంబంధించి ఎక్కడైతే ఖాళీ జాగ ఉందో దానిని తాము స్వాధీనం చేసుకుంటున్నామని, ఇదే క్రమంలో ఖాజాగూడకు సంబంధించి పర్మిషన్ ఎక్కడి వరకు ఉందో అక్కడి వరకు ఒప్పుకొంటామని, ముందుకు వస్తే మాత్రం ఊరుకోబోమని చెప్పినట్లు తెలిపారు. ఓఆర్ఆర్ పరిధిలో 1025 చెరువులను గుర్తించామని, రకరకాల డేటాల ద్వారా వచ్చే ఏడాది కల్లా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తామని, చెరువుల హద్దులపై గ్రౌండ్ వర్క్ జరుగుతున్నదని, సాంకేతిక పరిజ్ఞానంతో చెరువులకు సరిహద్దులు, బఫర్‌జోన్‌లు నిర్ణయిస్తున్నామని, వీటిపై స్పష్టత రాగానే హైడ్రా యాక్టివ్ అవుతుందన్నారు. శాటిలైట్ ఇమేజ్‌తో అత్యంత రెజుల్యూషన్ ఉన్న డేటాను తీసుకుంటున్నామని, 2000 నుంచి 2024 వరకు శాటిలైట్ ఫొటోలతో పాటు 2006 నుంచి 2023 వరకు ఏరియల్ డ్రోన్ ఇమేజెస్ కూడా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కోసం వాడుతున్నామన్నారు. ఇప్పటివరకు హైడ్రాకు 5800 ఫిర్యాదులు వచ్చాయని, 27 మున్సిపాలిటీల్లో అనధికార నిర్మాణాలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని వెల్లడించారు. రోజురోజుకూ హైడ్రాకు వచ్చే ఫిర్యాదులు పెరుగుతున్నాయని, ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులకే ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

#### ఇకపై కిరాయిదారులకూ నోటీసులు..

శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా ఆక్రమణలను గుర్తిస్తున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. నగరంలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కఠినంగానే ఉంటుందని, జూలై తర్వాత అనధికారికంగా, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించే వాటిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. హైడ్రా ఏర్పాటుకు ముందు అనుమతులు ఉన్నా.. లేకున్నా నివాసగృహాల జోలికి హైడ్రా పోదని, ఇకపై ఆక్రమణలు చేస్తే మాత్రం ఊరుకోబోమన్నారు. ప్రభుత్వం ఒక పాలసీని తీసుకొచ్చినప్పుడు కట్ ఆఫ్ డేట్ పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. నివాస గృహాలు కాకుండా కమర్షియల్‌గా ఉన్నవాటిని మాత్రం ఊరుకునేది లేదన్నారు. ఎఫ్‌టీఎల్‌లో అనాథరైజ్డ్ షెడ్స్ ఉంటే ఊరుకోబోమని చెప్పారు. నోటీసుల విషయంలో కూడా ల్యాండ్ ఓనర్స్‌కు ఇవ్వడం, వారు కిరాయిదారులకు కమ్యూనికేట్ చేయకపోవడం వల్ల కొన్ని సమస్యలు వచ్చాయని, ఇకపై కిరాయిదారులకు కూడా నోటీసులు ఇస్తామని రంగనాథ్ స్పష్టం చేశారు.

#### చెరువే లేదు.. చర్చ ఎందుకు..

మెడ మీద తల ఉంటదా.. తల మీద మెడ ఉంటదా.. అనే అడిగితే మెడ మీద తల ఉన్నట్లుగా చెరువుకట్టకు పైన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ఉంటుందని.. చెరువుకట్టకు కిలోమీటర్ దూరంలో మేం ఉంటామని రంగనాథ్ తెలిపారు. అక్కడ చెరువే లేదని, లేని చెరువు గురించే చర్చ చేస్తున్నామన్నారు. బఫర్, ఎఫ్‌టీఎల్ ఎప్పుడొస్తుందంటే.. నీరు ప్రవహిస్తూ వచ్చినప్పుడు అడ్డుకట్ట అయినప్పుడు అక్కడ నీరు ఆగి దాని అప్‌స్ట్రీమ్ అంతా మునిగిపోతుందని, అక్కడ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు వస్తాయన్నారు. 'మా ఇల్లు డౌన్ స్ట్రీమ్‌లో కిలోమీటర్ దూరంలో ఉన్నప్పుడు అక్కడ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ఎందుకు వస్తుంద'ని ప్రశ్నించారు.

#### శిఖంపట్టా ఉన్నవారికి హక్కులుండవు..

బుద్ధభవన్ బఫర్‌జోన్‌లో ఉంటుందంటున్న ప్రశ్నకు బుద్ధభవన్ కింద ఉన్న నాలాను ఎక్కడా బ్లాక్ చేయడం లేదని స్పష్టం చేశారు. చెరువులను కబ్జా చేస్తున్నదానిపై శిఖం పట్టా అనేది కీలకమన్నారు. శిఖం పట్టా కింద తీసుకుని కబ్జాలకు చేస్తున్న దానిపై తాము న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నామన్నారు. అసలు శిఖం పట్టా విషయంలో ఇందులో రెండురకాలుంటాయన్నారు. ఒకటి సర్కారీ శిఖం, మరొకటి శిఖం పట్టా ఉంటుందని, చెరువు తయారు చేసేటప్పుడు శిఖం పట్టాకు పరిహారం ఇచ్చే చేస్తామని, ఆ తర్వాత ఏక్‌సాల్ పట్టా ఇస్తారన్నారు. ఆ తర్వాత లీజ్ రెన్యువల్ కాకుండా పహణీలో పట్టా అని రావడం వల్ల సమస్యలు వస్తున్నాయన్నారు. శిఖం పట్టా ఉన్న వారికి ఎలాంటి ఓనర్ షిప్ ఉండదని, వారు కేవలం సాగు చేయడం తప్ప.. హక్కులు ఉండవన్నారు.

#### అధికారులపై చర్యలకు సిఫారసు..!

చెరువుల ఆక్రమణలు తొలగించే సమయంలో అక్కడ ఆక్రమణలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుంటున్నామని రంగనాథ్ తెలిపారు. గండిపేట వంటి చాలా చోట్ల అధికారులపై చర్యలకు సిఫారసు చేశామన్నారు. నిజాంపేటకు సంబంధించిన చెరువుల ఆక్రమణలపై ఆరుగురిపై, ఆ తర్వాత ఐదుగురిపై చర్యలకు సిఫారసు చేశామన్నారు. చాలా మంది అధికారులనూ గుర్తించామన్నారు.


#### త్వరలో హైడ్రా పీఎస్..ఎఫ్ఎం రేడియో..

ప్రస్తుతం హైడ్రాకు 15 బృందాలు పనిచేస్తున్నాయని, మరికొందరిని కూడా రిక్రూట్ చేసుకుంటున్నామని రంగనాథ్ తెలిపారు. త్వరలోనే 72 డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులోకి వస్తాయన్నారు. వెదర్ డేటాను విశ్లేషించేందుకు హైడ్రాలో ఒక టీంను ఏర్పాటు చేస్తున్నామని, హైడ్రాకు త్వరలో ఒక ఎఫ్ఎం చానల్ ఏర్పాటుకు కూడా ప్రయత్నిస్తున్నామన్నారు. హైడ్రా కార్యాలయంలో వచ్చే ఏడాది నుంచి ప్రతీ సోమవారం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకే ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. హైడ్రా ఆధ్వర్యంలో త్వరలోనే పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు.

# కుల వృత్తులకు జీవం పోసిన కేసీఆర్

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, డిసెంబర్ 28: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుల వృత్తులకు జీవం పోశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ చందన చెరువు కట్టపై శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి విగ్రహాన్ని ఎమ్మెల్సీ మధుసూదనాచారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కేసీఆర్.. దేవాలయాల అభివృద్ధికి, కుల సంఘాల భవనాల కోసం అడగకుండానే నిధులు కేటాయించి భవనాలు, దేవాలయాలను అభివృద్ధి చేయించారని ఆమె గుర్తు చేశారు. ఏది అడిగినా వెంటనే కేటాయించే వారన్నారు. లెనిన్ నగర్‌లో వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయ నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు చెప్పారు. పక్కనే పేద ప్రజల కోసం ఫంక్షన్ హాల్ నిర్మించినట్లు పేర్కొన్నారు. పది లక్షలతో గుడి నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. విశ్వ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వీర బ్రహ్మేంద్ర స్వామి అందరి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అలాంటి మహనీయుని విగ్రహం చందన చెరువు కట్టపై ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి జ్ఞాన బోధ చేసిన గొప్ప వ్యక్తి వీర బ్రహ్మేంద్రస్వామి అని ఆయన అన్నారు. సామాజిక, ఆర్థిక అసమానతలపై తిరుగుబాటు చేసిన మహాయోధుడు అని అన్నారు. బ్రహ్మంగారిని సంఘ సంస్కర్తగా ప్రపంచం గుర్తించిందన్నారు. కాగా, వేర్వేరుగా విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, టీయూఎఫ్‌యూడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాతానర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లెలగూడలోని చందన చెరువు కట్టపై వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి



# దళారులదే రాజ్యం పత్తి కొనుగోళ్లలో గందరగోళం

*జిల్లాలోని పత్తి కొనుగోలు కేంద్రాల్లో దళారులే రాజ్యమేలుతున్నారు. అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై అన్యాయం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆకుతోటపల్లి పత్తి కొనుగోలు కేంద్రం వద్ద వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. సీసీఐ అధికారులు వ్యాపారుల పత్తి వాహనాలను నేరుగా లోపలికి అనుమతించి కొనుగోలు చేస్తున్నారని, తమ వాహనాలను అనుమతించకపోవడంతో రోజుల తరబడి మిల్లుల వద్ద నిరీక్షించాల్సి వస్తున్నదని రైతులు భగ్గుమంటున్నారు. సీసీఐ అధికారులు వ్యాపారుల కొమ్ము కాయడం సరైన పద్ధతి కాదని మండిపడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పత్తికి మద్దతు ధర రాకపోగా కొనుగోలు చేసేందుకు కూడా నిరాకరిస్తున్నారని, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.*

*- రంగారెడ్డి, డిసెంబర్ 28 (నమస్తేతెలంగాణ)*

#### వరుస సెలవులు.. రైతుల ఆందోళనతో కొనుగోళ్లు..

ఈ వారంలో వరుసగా సెలవులు వచ్చాయి. దీంతో వారం రోజులుగా పత్తి మిల్లుల వద్దే రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుధవారం క్రిస్మస్, గురువారం బాక్సింగ్‌డే సెలవులొచ్చాయి. గురువారం రాత్రి మాజీప్రధాని మృతి చెందడంతో ప్రభుత్వం శుక్రవారం సెలవు దినంగా ప్రకటించింది. దీంతో గత రెండురోజులుగా మిల్లుల వద్దే పడిగాపులు కాస్తున్న రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. దీంతో మధ్యాహ్నం నుంచి సీసీఐ అధికారులు పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు. వ్యాపారుల ట్రాక్టర్లు, లారీలను లోనికి అనుమతించి, తమ వాహనాలను పంపించకపోవడంతో పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. శని, ఆదివారాల్లో కూడా పత్తి కొనుగోలుకు అధికారులు బ్రేక్ ఇచ్చారు. సోమవారం కూడా అమావాస్య కావడంతో కొనుగోలు చేస్తారా.. లేదా అన్నది తెలియాల్సి ఉన్నది. కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షించలేక కొందరు రైతులు అక్కడే వ్యాపారులకు పత్తిని అమ్ముతున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని ఆకుతోటపల్లి, ఔరుపల్లి, షాద్‌నగర్, చేవెళ్ల వంటి పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద ఈ పరిస్థితి నెలకొన్నదని రైతులు వాపోతున్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు. సెలవు రోజుల్లోనూ మిల్లుల వద్ద ఉన్న వాహనాల్లోని పత్తిని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

- అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులకు అన్యాయం
- రోజుల తరబడి మిల్లుల వద్దే నిరీక్షణ
- రైతుల పత్తి లోడు వాహనాలకు ఎన్నో ఆంక్షలు..
- వ్యాపారుల వాహనాలకు నేరుగా ఎంట్రీ
- చోద్యం చూస్తున్న సీసీఐ అధికారులు



ఆందోళన చేస్తున్న పత్తిరైతులు

#### రైతుల వద్దే పత్తిని కొనుగోలు చేయాలి..



ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు అప్పజెప్పి తీవ్రంగా నష్టపోతున్నాం. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో వ్యాపారుల నుంచి కాకుండా నేరుగా రైతుల నుంచే పత్తిని కొనుగోలు చేయాలి. అధికారులు దళారులకు కొమ్ముకాస్తూ వారివద్ద కమీషన్లు తీసుకుని రైతులను నట్టేట ముంచుతున్నారు. ప్రభుత్వం స్పందించి పత్తి రైతులకు న్యాయం జరిగేలా చూడాలి.

– రాంలాల్‌నాయక్, మాడ్గుల

#### దళారుల కొమ్ముకాస్తున్న అధికారులు..



పత్తిని కొనుగోలు చేసేందుకు అధికారులు అనేక ఆంక్షలు విధిస్తున్నారు. దళారుల వాహనాలకు మాత్రం ఏ ఆంక్షలు లేకుండా నేరుగా అనుమతించడం బాధగా ఉన్నది. నాలుగైదు రోజులుగా సీసీఐ కేంద్రం వద్ద నిరీక్షిస్తున్నా పట్టించుకునేవారే లేరు. వ్యాపారులు అగ్గవసగ్గువకు పత్తిని కొని మమ్మల్ని నిండా ముంచేటట్టున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకుని రైతులకు న్యాయం చేయాలి.

– బాలూ నాయక్, నాగిళ్ల